**జరిగిన కథ :** శ్రీదర్శనుడు జూదంలో తన ఆస్తినంతా పోగొట్టుకున్నాడు. ప్రాణత్యాగానికి సిద్ధపడ్డాడు. అప్పుడు అతనికి తన మిత్రుడొక కథ చెప్పాడు. ఆ కథ ప్రకారం.. కాశ్మీర దేశాధిపతి అయిన భూనందనుడికి ఒక వింత కల వచ్చింది. అందుకు తగ్గట్లే ఒక వ్యాజ్యంలో తీర్పు చెప్పాల్సి వచ్చింది. దాంతో తన కలలో కనిపించిన సుందరిని ఎలాగైనా పొందాలని తపస్సుకు కూర్చున్నాడు భూనందనుడు.



కాశీ మజిలీ కథలు 103

అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

# పాతాళ సుందరి

మహర్షి చెబుతున్నాడు.

''మహారాజా! నీ కలలో కనిపించిన సుందరి ఒక పాతాళలోక నివాసిని. రాక్షసకన్య. పాతాళలోక వాసుల సౌందర్యం, వారి మహిమలు మానవులకు అంతుపట్టవు. ఆమె వల్ల నువ్వు విరాళిలో తూలిపోవడం వింతేమీ కాదు. విచారించకు. నువ్వు కోరితే నిన్నక్కడికి తీసుకుపోగలను!''.

ఆయన మాటలతో భూనందనుడికి చెప్పలేనంత సంతోషం కలిగింది.

''మహాత్మా! నా పాలిట మీరే మహేశ్వరులు. నా తపస్సు పండించడానికే దర్శనమిచ్చారు. నామీద ఇంత కరుణ చూపిన మీ వృత్తాంతమేమిటో తెలుసుకోవచ్చా?!'' అని పలికాడు.

అందుకు చిరునవ్వు నవ్వుతూ, మహర్షి తన గాథను చెప్పసాగాడు.

''కాశ్మీర దేశాధిపతీ! మాది దక్షిణదేశం. మా తండ్రి పేరు యజ్ఞవర్మ. నాపేరు వసుభూతి. గొప్ప యోగసాధకుడైన మా తండ్రినుంచి పొందిన జ్ఞానంతో నేను పాతాళశాస్త్రాన్ని పఠించాను. హాటకేశ్వర మంత్ర తంత్ర విధులను క్షుణ్నంగా అభ్యసించాను. అంతటితో విడిచిపెట్టకుండా శ్రీశైలంలో చాలాకాలం తపస్సు చేశాను.

మల్లికార్జున దేవుడు నన్ను కరుణించి స్వప్నంలో కనిపించాడు..

'వసుభూతీ! నువ్వు పాతాళలోకానికి వెళ్లి, దైత్యకన్యలతో చాలాకాలం సుఖించిన తరువాత నన్ను చేరుకోగలవు. భూలోకం నుంచి పాతాళానికి వెళ్లడానికి అనేక మార్గాలున్నాయి. వాటిలో ముఖ్యమైనది కాశ్మీరదేశంలో ఉంది. అది పూర్వం మయబ్రహ్మచేత నిర్మితమైంది. ఆ మార్గాన్ని అనుసరించి బాణాసురుని కూతురైన ఉష.. పూర్వం అనిరుద్ధునితో క్రీడించింది. అప్పుడామెకు ప్రద్యుమ్నుడనే కుమారుడు ఉదయించాడు. కొడుకును రక్షించుకోవడం కోసం ఉషాదేవి ఆ గిరికూటాలలో ఒక ద్వారం నిర్మించి, దుర్గాలయం కట్టించింది. ఆ గిరికూటానికే ప్రద్యుమ్నకూటం అని పేరు. నువ్వు ఆ మార్గంలో వెళ్తే నీకు భోగసిద్ధి కాగలదు!'.. అని పలికి మల్లికార్జునుడు అంతర్ధానమయ్యాడు.

అలా శివుని ఆనతిమేరకు నేనీ భూమికి వచ్చాను. ఇక్కడ త్రికూటశైలంపై త్రిమూర్తులు వెలిసి ఉన్నారని, వితస్తానదీ తీరం పరమపావనమని వీటిని సేవించాను. నువ్వు కనిపించావు. నాతో వస్తే నీకు నీ కలలో కనిపించిన కన్యను చూపగలను!''.. అని చెప్పి, రాజును బయల్దేరదీశాడు మహర్షి.

ఆ మహర్షి వెంట రాజుతోపాటు అనేకమంది శిష్యులు కూడా ఉన్నారు. వారంతా కలిసి ప్రద్యుమ్నకూటమనే గిరిశిఖరాన్ని ఎక్కి.. అక్కడ నెలకొన్న వినాయకుణ్ని, శారికాదుర్గను ఆరాధించారు.

ఒకచోట మహర్షి చేతిలోకి ఆవాలు తీసుకుని మంత్రించి నాలుగుమూలలా చల్లాడు. ఒకచోట భూమినుంచి తలుపు ఒకటి తెరుచుకుంది. కిందికి మెట్లు కనిపించాయి. ఆ మెట్ల వెంబడి పదిరోజులపాటు అహోరాత్రాలనే భేదం లేకుండా వాళ్లంతా నడిచివెళ్లసాగారు.

పదకొండోనాటికి పాతాళగంగ కనిపించింది. అక్కడి భూమి అంతా వెండిమయంగా ఉంది. ఆ గంగాతీరంలో చందనం, అగరుచెట్ల వాసనలు కమ్ముకుని ఉన్నాయి. ఆ వనమధ్యంలో మణిశిలలతో నిర్మించిన హాటకేశ్వర లింగం ఉంది. అక్కడి చెట్లపూలతో, గంగతో ఆ లింగాన్ని అర్చించిన మీదట మళ్లీ బయల్దేరబోతుండగా ఒక వింత జరిగింది.

''పండ్ల చెట్లు కనిపిస్తే ఎవరూ ముట్టుకోవద్దు'' అని మహర్షి చెప్పబోతున్నాడు. అంతలోనే ఒక శిష్యుడు నేరేడు పండు కనిపిస్తే.. తెంపి నోట్లో వేసుకున్నాడు. అతను అక్కడే శిలగా మారిపోయాడు. మిగిలినవారంతా ఆ దృశ్యాన్ని చూసి భయపడుతూ క్రోసెడు దూరం పరిగెత్తారు.

వసుభూతి వెనుక మెల్లిగా వచ్చి, శిష్యులతో కలుసుకున్నాడు. వారిని ముందుండి మరికొంతదూరం నడిపించాడు. అక్కడో స్వర్ణప్రాకారం కనిపించింది. తలుపులు మూసి ఉన్నాయి. బయట రెండు మేకలు దర్శనమిచ్చాయి. వాటికి ఇనుప కొమ్ములున్నాయి. సమీపించిన వారిని కొమ్ములతో కుమ్ముతూ.. లోపలికి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నాయి.

వసుభూతి తన యోగదండంతో మంత్రించి, ఆ మేకల తలపై కొట్టాడు. వజ్రాయుధం దెబ్బ తగిలినట్లు రెండు మేకలూ బాధతో మూలుగుతూ అక్కణ్నుంచి పారిపోయాయి. తలుపులు తెరిచి శిష్యులతో కలిసి లోపలికి ప్రవేశించాడు వసుభూతి.

లోపల అనేకమంది సైనికులున్నారు. వాళ్లంతా రాక్షసులు. వీరిని చూసి మీదికి రాబోయారు. వసుభూతి మంత్రాక్షతలు చల్లుతుంటే రాక్షసులంతా ఎక్కడివార